సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 13 । మే । 2023

I



శరణు శరణు రాజన్న

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి తలనీలాలు, నిలువెత్తు బెల్లం పంపిణీ, కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారి మందిర ప్రవేశం

సిరిసిల్లటౌన్: స్థానిక 14వ వార్డులో శ్రీ జగదాంబ అమ్మవారి నూతన మందిర ప్రవేశ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
42.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సాగునీటి సమస్యల పరిష్కారానికి సబ్ డివిజన్



పూజ కార్యక్రమంలో ఈఈ, తదితరులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సాగునీటి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సబ్ డివిజనల్ మంజూరు చేసిందని నీటిపారుదలశాఖ ఈఈ అమరేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో నూతనంగా మంజూరైన నీటిపారుదలశాఖ సబ్ డివిజనల్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ చొరవతో మల్లన్నసాగర్, ఎగువ మానేరు ప్రాజెక్టులతో పాటు 58 చెరువులు, కుంటలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. 22వేల ఎకరాలకు సాగునీటిని సవ్యంగా అందించేందుకు ఇక్కడ ఒక డీఈఈ, ఇద్దరు ఏఈఈలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు ఉంటారన్నారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, ఏఈలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సిరిసిల్లటౌన్: యోగా అభ్యాసంతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని విజ్ఞాన వర్ధిని పాఠశాలలో నిర్వహిస్తున్న బాలల వ్యక్తిత్వ వికాస శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. యోగాసనాలు, సూర్య నమస్కారాలు, హస్తకళల్లో నైపుణ్యం వంటివి సాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారని విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమం నిర్వాహకులు ఆదియోగి, యోగా సాధన ఆలయం శిక్షకులు ఉప్పుల శ్రీనివాస్, పాఠశాల కరెస్పాండెంట్ మందాడి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూరింటికి ‘లక్షల’ కష్టాలు..!



- ‘కర్రలు, రేకులు, కవర్లతో గల గుడిసె ముందున్న ఈమె పేరు ఓర్సు రాజమ్మ. 20 ఏళ్లుగా తంగళ్లపల్లి వడ్డెరకాలనీలో ఈ గుడిసె వేసుకుని భర్త ఓదేలుతో కలిసి ఉంటుంది. ఇద్దరూ దినసరి కూలీలు. వీరికి ఇద్దరు కూతుర్లు. నిత్యం రెక్కల కష్టాన్ని నమ్ముకుని ఇసుక, ఇటుకలు మోస్తూ, ఎక్కడ కూలీ దొరికితే అక్కడ పనిచేస్తూ పొట్ట పోసుకుంటున్నారు. కాగా ఈ ఇల్లు జాగాను రెగ్యులర్ చేసుకోడానికి రూ.1.50లక్షలు చెల్లించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. లేకుంటే ఇల్లు ఖాళీ చేయమంటున్నారు.’

- ఎల్‌ఆర్‌ఎస్‌తో వడ్డెరుల విలవిల
- జీవో 59లో రూ.లక్షలు చెల్లించాలని నోటీసులు
- దినసరి కూలీలు.. పట్టాలేని బతుకులు
- జీవోపై అవగాహన లేక.. చిక్కుల్లో వడ్డెరులు
- ఇది తంగళ్లపల్లి వడ్డెరకాలనీ క(వ్య)థ



తంగళ్లపల్లి వడ్డెరకాలనీలో పూరిళ్లు

సిరిసిల్ల: జిల్లాలోని తంగళ్లపల్లి మండలకేంద్రంలో వడ్డెరకాలనీ ఉంది. మూడు దశాబ్దాల కిందట బండ కొట్టుకుంటూ జీవనం సాగించే వడ్డెరులు ఆ బండ చుట్టూరా ఖాళీ ప్రభుత్వ స్థలంలో పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగించారు. ఆ స్థలంపై ఎలాంటి హక్కులు, పట్టాలు వారికి లేవు. 96 కుటుంబాల వడ్డెరులు రోడ్డు లేక, నివాస యోగ్యం కాని స్థలంలో కనీస వసతులకు దూరంగా ఉన్నారు. కాలక్రమంలో బండ కొట్టుకునే పని దూరమైంది. ట్రాక్టర్లు, లారీల్లోకి ఇసుక మోస్తూ, ఇతర కూలీ పని చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. నిరుపేదలైన వీరికి పట్టాలు ఇప్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కానీ ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో రూ.లక్షల్లో డబ్బులు చెల్లించాలని సదరు అధికారులు నోటీసులు జారీ చేశారు.

జీవో 59 తెచ్చిన తంటా

జీవో 58 ప్రకారం నివాస స్థలం గుంట (121 గజాలు) లోపు ఉన్నవారికి ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండానే పట్టాలు జారీ అయ్యాయి. ఇలా వడ్డెర కాలనీలోని 58 కుటుంబాలకు జీవో 58 ద్వారా పట్టాలు జారీ కాగా, కొద్దిపాటి నివాస స్థలం ఇంటి ముందు, ఇంటి పక్కన 121 గజాల కంటే ఎక్కువ ఉన్నవారిని జీవో 59 ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్‌లో క్రమబద్ధీకరించేందుకు ప్రతిపాదించారు. దీని ప్రకారమే ఆన్‌లైన్‌లో వడ్డెరులతో దరఖాస్తులు చేయించారు. దీంతో 38 వడ్డెర కుటుంబాలకు రూ.1.25 లక్షల నుంచి రూ.3.75 లక్షల వరకు చెల్లించాలని నోటీసులు జారీ అయ్యాయి. మార్కెట్ విలువ ఆధారంగా వంద శాతం డబ్బులు చెల్లించాలని డిమాండ్ నోటీసు ఏఓ జీవో 22200175164–1, తేదీ 06.12.2022 న కలెక్టర్ అనురాగ్ జయంతి పేరుతో జారీ అయ్యాయి. తంగళ్లపల్లిలో మార్కెట్ విలువ ఎక్కువగానే ఉన్నా వడ్డెరకాలనీలో స్థలం విలువ అంత లేదు. మరోవైపు వీరంతా పేదలే కావడంతో ఆ డబ్బులు చెల్లించేందుకు ఆర్థిక స్థోమత లేదు. పట్టాలు రాక, చేతిలో పైసలు లేక రెవెన్యూ అధికారుల నోటీసులతో దిక్కులు చూస్తున్నారు.



తంగళ్లపల్లిలోని వడ్డెరకాలనీలో సరిగా దారి లేని ఓ పూరిల్లు

- ‘ప్లాస్టిక్ కవర్లతో కప్పిన ఇంటి ముందున్న ఈమె పేరు దండ్ల కళ. ఆమె భర్త రాములు. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కళ 25 ఏళ్లుగా ఇక్కడే ఈ ఇంట్లో ఉంటుంది. ఇద్దరు కూతుర్లు, ఒక్క కొడుకుతో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకున్నారని తంగళ్లపల్లి రెవెన్యూ అధికారులు రూ. 1.20 లక్షలు చెల్లిస్తే.. స్థలాన్ని క్రమబద్ధీకరిస్తామని నోటీసులు జారీ చేశారు. రెక్కాడితేకానీ డొక్క నిండని, కనీసం అప్పు కూడా పుట్టని కళ దంపతులు రూ.లక్షలు ఎక్కడి నుంచి తేవాలని తొక్కులాడుతున్నారు.’ ఇలా ఈ ఒక్కరిద్దరు కాదు.. తంగళ్లపల్లిలోని 38 మంది నిరుపేద వడ్డెర కార్మికులకు రూ.లక్షల చొప్పున చెల్లించాలని నోటీసులు ఇచ్చారు.



ప్రభుత్వమే ఆదుకోవాలే



మా కాలనీలో అందరూ పేదవారే. రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. ఎవ్వరికి కూడా వేరే ఇతర ఆస్తులు లేవు. పట్టాలకు రూ.లక్షల్లో డబ్బులు చెల్లించాలంటే ఎవరితోనూ కాదు. మంత్రి కేటీఆర్ మా బతుకులను చూసి ప్రభుత్వమే ఆదుకోవాలే.

– అలకుంట దుర్గయ్య, వడ్డెర కార్మికుడు

పనికూడా దొరుకుత లేదు



మాకు పని కూడా దొరుకుత లేదు. ఏ పూటకు ఆ పూట ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఇద్దరు పిల్లలను సాదుకోవాలే. రెండు గుంటల జాగాకు రూ.3.17 లక్షలు చెల్లించాలని నోటీసు ఇచ్చిండ్రు. దొడ్డు బియ్యం(రేషన్) తిని బతుకుతున్నాం. మా దగ్గర పైసలు లేవు.

– గండికోట రేణ, వడ్డెర కార్మికురాలు, తంగళ్లపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకే నోటీసులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో 59 ప్రకారం నోటీసులు జారీ చేశాం. ఖాళీ స్థలానికి మార్కెట్ విలువలో వంద శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇల్లు కట్టుకున్న స్థలంపై 50 శాతం చెల్లించాల్సి ఉంది. మూడు విడతల్లో డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ చేశాం. కానీ ఎవరూ కట్టడం లేదు.

– సదానందం, తహసీల్దార్, తంగళ్లపల్లి

దక్షిణ, పశ్చిమాలను కలిపేలా!

- కరీంనగర్‌– హసన్‌పర్తి రైల్వేలైన్‌కు కేంద్రం సుముఖం
- ఎఫ్‌ఎల్‌ఎస్ సర్వేకు రూ.1.54 కోట్లు విడుదల
- 62 కిలోమీటర్ల లైన్‌తో పాత వరంగల్‌– కరీంనగర్‌కు ప్రయోజనం
- మహారాష్ట్ర, గుజరాత్‌కు నేరుగా ప్రయాణించే వీలు
- సికింద్రాబాద్‌కు త్వరగా చేరుకునే అవకాశం
- తగ్గనున్న 200 కిలోమీటర్ల ప్రయాణదూరం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త మోసుకొచ్చింది. చాలాకాలంగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్ సర్వేకు కేంద్ర రైల్వే బోర్డు ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.1.54 కోట్లు కూడా విడుదల చేసింది. దీంతో ఆగిపోయిందనుకున్న ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కనుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే కనెక్టివిటీ పరంగా మిగిలిన జిల్లాలతో పోలిస్తే వెనకబడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఈ ప్రాజెక్టు అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్ 21న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ప్రాజెక్టును పట్టాలెక్కించాలని కోరిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర రైల్వేబోర్డు సర్వేకు ఆమోదం తెలుపుతూ మే 8వ తేదీన ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ప్రధాని పీవీ హయాంలో కదలిక

వాస్తవానికి కరీంనగర్‌– ఖాజీపేట రైల్వేలైన్ ఇప్పటిది కాదు. 1976లోనే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. కానీ, సర్వే, అంచనా వ్యయం తదితర విషయాల్లో ఎలాంటి పురోగతి నమోదు కాలేదు. ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు స్వీకరించాక 1994లో ఈ ప్రాజెక్టు తిరిగి తెరమీదకు వచ్చింది. గతంలో ఈ ప్రాజెక్టును కరీంనగర్–ఖాజీపేటగా పిలిచేవారు.



కేంద్ర మంత్రితో సమావేశమైన ఎంపీ బండి సంజయ్(ఫైల్)

వాస్తవానికి కరీంనగర్‌కు భౌగోళికంగా దారితీసే హసన్‌పర్తి రోడ్ స్టేషన్ నుంచి హుజూరాబాద్ మీదుగా మానకొండూరు తరువాత కరీంనగర్‌– పెద్దపల్లి రైల్వేలైన్ మీదుగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు చేరాలి. కరీంనగర్–హసనపర్తిల మధ్య రైల్వేలైన్ దూరం 45 కి.మీ మాత్రమే అని గతంలో అధికారులు తెలిపారు. తాజాగా ఈ కేంద్రం జారీ చేసిన ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్‌ఎల్‌ఎస్)లో మాత్రం దీని దూరాన్ని 61.8 కిమీగా పేర్కొనడం విశేషం.

కనెక్టివిటీ ఇలా..

- కరీంనగర్‌– హసన్‌పర్తి రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే.. పాత వరంగల్‌– కరీంనగర్ జిల్లాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. ముఖ్యంగా దక్షిణ– పశ్చిమ భారతదేశానికి ఈ రైల్వేలైన్ ఒక సంధానసేతువుగా నిలుస్తుంది. ప్రస్తుతం మహారాష్ట్ర వెళ్తున్న కరీంనగర్, వరంగల్ ప్రజలకు దాదాపు 200 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన ప్రయాణభారం తప్పుతుంది.
- ఈ ప్రాజెక్టు పూర్తయితే కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ప్రజలు మహారాష్ట్రలోని ముంబై, గుజరాత్‌లోని అహ్మదాబాద్ వంటి ఇతర నగరాలకు ప్రయాణించే అవకాశం ఉంటుంది. మహారాష్ట్రలోని షిరిడీ, ఔరంగాబాద్, గుజరాత్‌లోని పలు పుణ్యక్షేత్రాలను కలిపేలైన్ కావడంతో పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతుంది.
- ఇప్పటికీ వరంగల్ నుంచి నిజామాబాద్ రైలు ప్రయాణం సాకారం కాలేదు. కానీ, నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి రైల్వేలైన్ పూర్తి కావడంతో కరీంనగర్ వరకు రైల్వేలైన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇప్పుడు కేవలం హసన్‌పర్తి నుంచి కరీంనగర్ వరకు లైన్ వేస్తే నిజామాబాద్–వరంగల్ మధ్య ప్రయాణం సాకారమవుతుంది.
- ఇక వరంగల్–కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజలు ముంబై వెళ్లాలంటే ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రాపూర్ మీదుగా దాదాపు 200 కి.మీ దూరం తిరిగి వెళ్లాలి. ఈ లైన్ పూర్తయితే.. ఆ ప్రయాణభారం తగ్గుతుంది.
- ప్రస్తుతం కరీంనగర్ ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే కరీంనగర్‌– హసన్‌పర్తి రైల్వేలైన్ పూర్తయితే నేరుగా ఖాజీపేటకు లైన్ అందుబాటులోకి వస్తుంది. దీంతో కరీంనగర్ వాసులకు సికింద్రాబాద్‌కు వేగంగా రైల్లో ప్రయాణం చేసే వీలు దక్కుతుంది.

కేంద్రమంత్రికి కృతజ్ఞతలు

కరీంనగర్‌– హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి 2013లోనే సర్వే చేసినప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ అలసత్వంతో రైల్వేలైన్ నిర్మాణంలో పురోగతి లేకుండా పోయింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లోని ఐటం నంబర్–11 ప్రకారం కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణం చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం కూడా అంగీకరించింది. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనం.

– ఎంపీ బండి సంజయ్

గతంలో ప్రతిపాదన రద్దు

వాస్తవానికి 2013 వరకు ఈ ప్రాజెక్టు అడపాదడపా తెరమీదకు రావడం ఆ తరువాత కనుమరుగవడం పరిపాటుగా మారింది. ఈ క్రమంలోనే కరీంనగర్–ఖాజీపేట రైల్వేలైన్ సర్వే జరిగింది. అప్పట్లో దాదాపు రూ.1.20 కోట్లు వెచ్చించి సర్వే చేసిన అధికారులు దాదాపు రూ.800 కోట్ల ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును చేపట్టడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఈ ప్రాజెక్టు రద్దు అప్పట్లో కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాటల మంటలు పెట్టింది కూడా. తాజాగా రైల్వే బోర్డు మరోసారి సర్వే చేసేందుకు ముందుకు రావడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- చందుర్తి ఠాణా తనిఖీ

చందుర్తి(వేములవాడ): ప్రజా ఫిర్యాదులపై జాప్యం చేయకుండా వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. శుక్రవారం చందుర్తి సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రోజువారీ జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్ తదితర రికార్డులు తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయంలో కేసుల వివరాలు పరిశీలించి, పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, వీపీఓలు ఆయా గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమాచార సేకరణలో ముందుండలన్నారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిందితులకు ఎక్కువ కాలం శిక్ష పడేలా చూడాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని సూచించారు. పాత నేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించేవారికి రివార్డులు, అవార్డులు ప్రతి నెలా అందజేస్తామని పేర్కొన్నారు. ఎస్పీ వెంట వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి ఎస్సైలు రమేశ్, రమాకాంత్, ప్రభాకర్ ఉన్నారు.



ఠాణా పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

క్లుప్తంగా

'ఎస్సైని విధుల్లోకి తీసుకోవాలి'

వేములవాడ: జగిత్యాల ఎస్సై అనిల్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు శుక్రవారం అన్నారు. ప్రభుత్వం ఒకే వర్గానికి కొమ్ము కాస్తూ ఎస్సైని సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

లారీ, కారు ఢీ..

ముస్తాబాద్ (సిరిసిల్ల) : ముస్తాబాద్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై నామాపూర్ శివారులో శుక్రవారం లారీ కారును ఢీకొట్టింది. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చిలుముల నవీన్‌చారి కుటుంబ సభ్యులతో కారులో మండలకేంద్రంలో జరిగే పెళ్లికి బయల్దేరారు. నామాపూర్ శివారులోకి చేరుకోగానే ఎదురుగా లారీ ముందు ఉన్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో నవీన్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసంకాగా కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విప్లవ సాహిత్యంపై పోలీసుల నిఘా..?

సిరిసిల్లక్రైం: విప్లవ సాహిత్యానికి సంబంధించిన ముద్రణ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు నిఘా పెంచినట్లు విశ్వసనీయంగా తెలిసింది. జగిత్యాల జిల్లాలో విప్లవ సాహిత్యానికి సంబంధించిన ముద్రణపై అక్కడి పోలీసులు దర్యాప్తు జరిపే క్రమంలో సిరిసిల్ల జిల్లాలోని కొన్ని ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నంబర్లు లభ్యమయ్యాయి. దీంతో జగిత్యాల పోలీసులు రెండు రోజుల క్రితం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పలు ప్రింటింగ్ ప్రెస్‌లను తనిఖీ చేసినట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: రెప్యూటెడ్ (కార్పొరేట్) జూనియర్ కళాశాలల స్కీంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో రెప్యూటెడ్ జూనియర్ కళాశాలల నిర్వాహకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి భాస్కర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ఎంసెట్, ఏఐఈఈఈ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వగలిగిన ప్రైవేట్ కళాశాలలు ఈ స్కీం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. గత ఐదేళ్ల అకడమిక్ ప్రొఫైల్‌తో పాటు కళాశాల సాధించిన ఫలితాలు, పోటీ పరీక్షల ర్యాంకులు, అందిస్తున్న మౌలిక సదుపాయాల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. telanganaepass. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15లోపు రిజిస్ట్రేషన్ చేసి 16లోపు జిల్లా ఎస్సీడీవో కార్యాలయంలో హార్డ్ కాపీ అందజేయాలన్నారు. ఎంపికైన కళాశాలకు ప్రతి విద్యార్థికి సంబంధించిన ట్యూషన్ ఫీజు రూ.35వేలు, పాకెట్ మనీ కింద రూ. 3వేలు ఏటా అందజేస్తామన్నారు.

4,186 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగులో 4,186 మందికి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 234 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 577 మందికి రీడింగ్, 374 మందికి పాయింట్ కంటి అద్దాలను అందించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- రాత్రి పూట పలు గ్రామాల నుంచి తరలిస్తున్న వైనం
- అతివేగంతో వెళ్తున్న వాహనాలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నిమ్మపల్లిలో రాత్రిపూట ఇసుకను డంప్ చేస్తున్న ట్రాక్టర్

కోనరావుపేట : మండలంలోని మూలవాగు పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నిత్యం రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో గ్రామాల్లో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఇసుక రవాణా వ్యవహారం తెలిసినా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మామూళ్ల తీసుకోవడంతోనే పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మితిమీరిన వేగంతో..

గ్రామాల్లో రాత్రిపూట ఇసుక రవాణా చేస్తున్న వాహనాల యజమానులు మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఓ గ్రామంలో ఇసుక ట్రాక్టర్ పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొనడంతో వాహనం కొంతమేర దెబ్బతినడంతో మరమ్మతు చేయించారు.

మూలవాగు పరివాహక ప్రాంతాల నుంచి..

మండలంలోని మూలవాగు పరివాహక ప్రాంతాలైన నిమ్మపల్లి, కొండాపూర్, బావుసాయిపేట, వట్టిమల్ల, మామిడిపల్లి, కనగర్తి, నిజామాబాద్ గ్రామాల నుంచి ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ఒక్కో గ్రామంలో సుమారు 5 నుంచి 10 ట్రాక్టర్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం. రవాణాదారులు ఒక్క దారే ప్రత్యామ్నాయ రహదారుల గుండా వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నారు.

రవాణాదారులకే నేరుగా సమాచారం

రాత్రి సమయాల్లో ఇసుక రవాణాచేస్తున్న వారికే పెట్రోలింగ్ వాహన సంచారంపై నేరుగా సమాచారం అందుతున్నట్లు తెలుస్తోంది. పెట్రోలింగ్ వాహనం గ్రామంలోకి ప్రవేశించగానే సమాచారం తెలుసుకొని ట్రాక్టర్లన్నీ ఒకచోట కనిపించకుండా నిలిపివేస్తున్నారు. వాహనం వెళ్లిపోగానే ఇసుక రవాణా చేస్తున్నారు. ఇదంతా గ్రామాల్లో నిత్యకృత్యమైంది.

నాలుగు నెలల్లో 10 ట్రాక్టర్లు..

మండలంలోని పలు గ్రామాల నుంచి రోజూ సుమారు 30–50 ట్రాక్టర్లు నడుస్తున్నాయి. వీటిలో జనవరిలో 4 ట్రాక్టర్లు, ఫిబ్రవరిలో 3, మార్చిలో 2, ఏప్రిల్‌లో ఒక ట్రాక్టర్ మాత్రమే పట్టుకున్నట్లు సమాచారం. కొందర్ని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

బైండోవర్ చేస్తున్నాం



గ్రామాల్లో రాత్రివేళలో ఇసుక తరలిస్తున్న వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నాం. మూడో సారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం. ఇసుకను తరలించే ముందు తప్పకుండా అనుమతులు తీసుకోవాలి.

– రమాకాంత్, ఎస్సై, కోనరావుపేట

వ్యాన్ ఢీకొని హమాలీ మృతి



ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

- తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల ధర్నా

సిరిసిల్ల క్రైం : ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీకొని ఓ హమాలీ మృతిచెందిన సంఘటన సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన బాల్‌రెడ్డి హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన పొలంలో పండిన వరి ధాన్యాన్ని బస్వాపూర్‌లో ఓ రైస్‌మిల్‌లో అమ్మేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తంగళ్లపల్లి నుంచి ఇసుకను తరలిస్తున్న వ్యాన్ సారంపల్లి వద్ద బాల్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని శిక్షించి తమకు న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేశారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ ఉపేందర్ హామీ ఇవ్వడంతో సద్దుమణిగింది. మృతుడికి భార్య ఉమ, కూతు కృతిక(11), సాత్విక (8) ఉన్నారు. పెద్ద దిక్కు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేసు నమోదు..

సిరిసిల్ల క్రైం : రోడ్డు ప్రమాదంలో దేశాయిపల్లికి చెందిన బాల్‌రెడ్డి మృతిచెందగా నిరసన తెలుపుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తంగళ్లపల్లి మండలంలో జరిగిన రోడ్డుప్రమాదంలో బాల్‌రెడ్డి అనే వ్యక్తి మృతిచెందాడు. దీనిపై కోనరావుపేటకు చెందిన భానుప్రకాశ్ మరో 13 మందితో కలిసి అంబేడ్కర్ చౌరస్తా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నిరసన తెలిపారు. దీంతో వీరందరిపై కేసునమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

రాజన్న ఆలయంలో టెండర్లు

వేములవాడ: రాజన్న ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు శుక్రవారం రెండేళ్ల పరిమితిపై బహిరంగ వేలం నిర్వహించారు. పాదరక్షలకు సంబంధించి రూ.21.55 లక్షలకు సీహెచ్.ధర్మయ్య, శివపురం షాప్ నంబర్ 11ను రూ.3.29 లక్షలకు కె.అభిలాష్, శంకరపురం షాప్ నంబర్ 22ను రూ.1.35 లక్షలకు డి.లక్ష్మీనారాయణ, శంకరపురం షాప్ నంగర్ 29ని రూ.1.63 లక్షలకు బి.నారాయణ, పార్వతీపురం ప్లాట్ నంబర్ 1ని రూ.20 లక్షలకు ఎ.భూదమ్మ, కరీంనగర్‌లోని షాప్ నంబర్ 22ను రూ.2.51 లక్షలకు జి. ఇందిరకు అప్పగించినట్లు ఏఈవో హరికిషన్ ప్రకటించారు. పర్యవేక్షకులు శ్రీరాములు, అరుణ్, ఆలయ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, తదితరులు

వేములవాడ: వేములవాడలో శుక్రవారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. దారి పొడవునా స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆద్యాగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోహన్ గోలి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, పురప్రముఖులు, హనుమాన్ దీక్షాపరులు, పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే దేశాభివృద్ధి

సిరిసిల్ల టౌన్ : బీజేపీని ఓడిస్తేనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. పార్టీ చేపడుతున్న ×దేశ్ కీ బచావో..బీజేపీ కీ హఠావో× కార్యక్రమం ముగింపు కరపత్రాలను సిరిసిల్ల కార్మిక భవనంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగాయన్నారు. నాయకులు రవి, సామల మల్లేశం, బుర్ర మల్లేశం, సోమ నాగరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సును ఉమ్మడి కరీంనగర్‌తో పాటు జగిత్యాల జిల్లా కేంద్రంలో అందజేసేందుకు నిర్ణయించినట్లు జిల్లా ఎస్సీడీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. అన్ని పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, రైల్వే వంటి ఉద్యోగాల సాధనకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎంపికైన వారికి ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ జూన్ నుంచి అక్టోబర్ వరకు కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాభ్యాసం చేస్తున్న, గతంలో శిక్షణ తీసుకున్నవారు, దరఖాస్తునకు అనర్హులుగా వివరించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3లక్షల లోపు ఉండాలని, దరఖాస్తుదారులందరికీ ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 98852 18053 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'ఏబీవీపీ కార్యకర్తలపై దాడి సరికాదు'

సిరిసిల్ల అర్బన్: గురునానక్, శ్రీ నిధి ప్రైవేట్ యూనివర్సిటీలను రద్దుచేసి విద్యార్థుల న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యామండలి వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీతో పాటు కార్యకర్తలపై పోలీసులు దాడి చేశారన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ నవీ న్, రాజు, ప్రవీణ్, సునీల్, కిరణ్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- రూ.4 లక్షలు, వెండి ఆభరణాలు అపహరణ



చిందరవందరగా వస్తువులు

ముస్తాబాద్ (సిరిసిల్ల): మండలంలోని నామాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో చొరబడి భారీగా నగదు, వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బిచ్చాల సత్తిరెడ్డికి చెందిన పాత ఇంటి తాళాలను గురువారం రాత్రి దొంగలు పగులగొట్టి ఇంట్లోని రూ.4 లక్షల నగదు, 6 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకున్న సత్తిరెడ్డి కుటుంబ సభ్యులు అందులోనే ఉంటున్నారు. శుక్రవారం ఉదయం పాత ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. నెల రోజుల క్రితం మల్లన్నసాగర్ కెనాల్‌లో కోల్పోయిన భూమికి రూ.4లక్షల పరిహారం రాగా దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

మన ఊరు- మన బడి పనుల్లో వేగం పెంచాలి

బోయినపల్లి(చొప్పదండి): మన ఊరు- మన బడి పనుల్లో వేగం పెంచాలని జెడ్పీ సీఈఓ గౌతంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావుపల్లి, మాన్వాడ, బోయినపల్లి, విలాసాగర్ గ్రామాల్లో మన ఊరు- మన బడి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయడంతో పాటు త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి, ఎంపీఓ గంగాతిలక్, సర్పంచు బూర్గుల నందయ్య ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

మండలంలోని కొదురుపాక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జెడ్పీ సీఈఓ గౌతంరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత కొనుగోలు చేశారు, నిల్వ ఉన్న ధాన్యం తదితర వివరాలు తెలుసుకున్నారు. మ్యాచర్ వచ్చిన ధాన్యం త్వరగా తూకం వేయాలని ఆదేశించారు. కేంద్రంలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

'రైతులను పట్టించుకోని ప్రభుత్వం'

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినా ఇప్పటివరకు పరిహారం అందించలేదన్నారు. మిల్లర్లు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆపదలో రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇక్కడ మండలశాఖ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కోనరావుపేట మండల అధ్యక్షుడు పాషా, డీసీసీ ఉపాధ్యక్షుడు గౌస్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చగౌడ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విజయఢంకా



అల్ఫోర్స్ విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు శుక్రవారం ప్రకటించిన సీబీఎస్ఈ ఫలితాల్లో విజయఢంకా మోగించారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో 500 మార్కులకు గాను జె.వావిక 495, ఎస్.అనిరుధ్ సాయి 492, బి.శ్రీహిత 487, ఎ.శివాశ్రిత 487, మరో 73 మంది విద్యార్థులు 450కి పైగా మార్కులు సాధించారన్నారు. 12వ తరగతిలో 500 మార్కులకు గాను పి.వేదవిష్ణు 486, డి.అశ్వితరెడ్డి 484, శికారి చందన 478, ఆర్.సుహాసిత 473, నిషాంత్‌పోర్వల్ 471, మరో 30కి పైగా 400కు పైన మార్కులు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్‌తోపాటు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

'పారమిత' విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు

కొత్తపల్లి(కరీంనగర్): సీబీఎస్ఈ ఫలితాల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 500 మార్కులకు గాను శ్రీనిజా రెడ్డి 495(99 శాతం) మార్కులు సాధించింది. 60 మంది 90 శాతం, ఆపైన, 46 శాతం మంది విద్యార్థులు 80 శాతం ఆపైన, 72 శాతం మంది విద్యార్థులు 70 శాతం ఆ పైన మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య తెలిపారు. 12వ తరగతిలో పీసీఎం విభాగంలో తేజేశ్వర్ 500లకు గాను 478 మార్కులు, వన్షిత 91.2 శాతం, హర్షవర్ధన్ 90.6 శాతం, పీసీబీ విభాగంలో స్ఫూర్తి 93.6 శాతం , పల్లవి 92.6 శాతం, బీఈఏ విభాగంలో మధుమోహన్ 90.80 శాతం మార్కులు తెచ్చుకున్నారని చెప్పారు. విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత ఇ.ప్రసాదరావుతోపాటు డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, రాకేశ్ ప్రసాద్, రష్మిత, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, పినాకిల్ హెడ్ గోపీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

'సెయింట్ జార్జ్' విద్యార్థుల సత్తా



విజయసంకేతం చూపుతున్న చైర్మన్ ఫాతిమారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): సీబీఎస్ఈ ఫలితాల్లో కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని విద్యాసంస్థల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. 10, 12వ తరగతుల్లో వందశాతం ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. 10వ తరగతిలో 500 మార్కులకు గాను విజయ్ శ్రీకర్ 472, అక్షయ్ వంశీప్రసాద్ 440, మనుచరణ్ 411 మార్కులు సాధించారన్నారు. 12వ తరగతిలో 12 మందికి గాను అందరూ పాసైనట్లు తెలిపారు. రోమీస సైన్స్ స్ట్రీమ్‌లో 437 మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపాల్ వి.నిరంజన్, అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, లెక్చరర్లు అభినందించారు.

'పది' ఫలితాల్లో 'భగవతి, అర్విన్‌ట్రీ' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాలల యాజమాన్యం

కరీంనగర్: పదోతరగతి ఫలితాల్లో భగవతి, అర్విన్‌ట్రీ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని చైర్మన్ బి.రమణారావు తెలిపారు. మొత్తం 72 మందికి గాను 63 మంది ఏ గ్రేడ్ సాధించారన్నారు. 10 జీపీఏ సాధించిన ఇ.వైశాలి, జి.సారిక, కె.శశ్విత, పి.మానస, జి.నితీష, వి.కృషాల్, 9.8 జీపీఏ తెచ్చుకున్న టి.విద్యాన్, సి.రేవన్ రెడ్డి, జి.శ్రీవర్షిత, కె.రిష్వన్‌లను ఆయనతోపాటు డైరెక్టర్ బి.విజయలక్ష్మి, టీచర్లు అభినందించారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

సిరిసిల్లటౌన్: తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ సెక్రటరీల ఉద్యమం ఉధృతం చేశారు. పక్షం రోజులుగా తాము నిరసనలు తెలుపుతుంటే సర్కారు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన శిబిరంలో శుక్రవారం జేపీఎస్‌లు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని లేకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

డీటీఎఫ్ సంఘీభావం

జేపీఎస్‌లు చేపడుతున్న న్యాయపోరాటం సరైందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏళ్ల తరబడిగా జేపీఎస్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అవురం సుధాకర్, వంగ తిరుపతి, జిల్లాలోని అన్ని మండలాల జేపీఎస్‌లు పాల్గొన్నారు.

'మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'



మాట్లాడుతున్న కేకే మహేందర్ రెడ్డి

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లెకు చెందిన గట్టు బాల్‌రెడ్డి అలియాస్ కిట్టు మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు. గురువారం బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం అరెస్ట్ చేసిన కాంగ్రెస్ నాయకులను కలిసి వారితో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్, ఎంపీటీసీ బైరినేని రాము, కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, బాలు ఉన్నారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి..

సిరిసిల్ల టౌన్: రైతు కుటుంబానికి చెందిన బాల్‌రెడ్డి (కిట్టు) ఇసుక వాహనం ఢీకొని మృతిచెందడం రాష్ట్ర సర్కారు హత్యేనని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే.మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇసుక మాఫియాపై ఎస్పీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు చోటు, రాములు తదితరులున్నారు.

స్టేషన్‌లో ఖాకీల కలహం

సిరిసిల్లక్రైం: శాంతి భద్రతలను కాపాడాల్సిన ఖాకీల మధ్య కలహాలు శుక్రవారం బహిర్గతమయ్యాయి. వివరాలు.. సిరిసిల్ల పోలీసుశాఖలోని ఓ సీనియర్ సీఐ, ఆ అధికారి ఆధీనంలో పని చేసే ఎస్ఐ స్థాయి అధికారికి ఓ పని అప్పగించారు. పై అధికారి చెప్పిన విధి నిర్వహణకు వెళ్లిన క్రమంలో అక్కడున్న పరిస్థితులు ఉద్రిక్తతకు దారితీయకుండా ఎస్ఐ స్థాయి అధికారి చక్కబెట్టే ప్రయత్నం చేశారు. దర్యాప్తు జరిగిన విషయాన్ని పై అధికారికి చెప్పేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో సీఐ స్థాయిని మరిచి మాట్లాడంతో ఇక వేధింపులు భరించలేమని భావించిన ఎస్ఐ తాను చేసిన తప్పేంటని ప్రశ్నించారు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లే సమయంలో తోటి అధికారులు, సిబ్బంది నిలువరించగా ఎస్ఐ వెనుదిరిగి ఠాణాలోకి వెళ్లినట్లు తెలిసింది. ఠాణాలోని సిబ్బంది నోట విషయం బయటకు రావడంతో, జరిగిన విషయాలు సేకరించే పనిలో స్పెషల్ బ్రాంచి పోలీసులు నిమగ్నమయ్యారు.